09-02-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - దుఃఖితులు అందరినీ సుఖమయంగా చేయడము, ఇది ఒక తండ్రి కర్తవ్యము మాత్రమే, వారే సర్వుల సద్గతిదాత"

ప్రశ్న:- తండ్రి తమ పిల్లలకు ఎక్కే కళలోకి వెళ్ళేటువంటి ఏ యుక్తిని వినిపిస్తారు?

జవాబు:- బాబా అంటారు, మధురమైన పిల్లలూ, నేను ఏదైతే వినిపిస్తానో, మీరు అదే వినండి. మిగిలినదంతా ఏదైతే విన్నారో, అది మర్చిపోండి ఎందుకంటే దాని వలన మీరు కిందకు దిగుతూ వచ్చారు.

ప్రశ్న:- ఏ గుహ్యమైన రహస్యాన్ని పిల్లలైన మీరు అర్థం చేసుకుంటారు, దానిలో అన్ని వేద శాస్త్రాల సారము వచ్చేస్తుంది?

జవాబు:- బ్రహ్మ నుండి విష్ణువుగా, విష్ణువు నుండి బ్రహ్మగా ఎలా అవుతారు, ఇరువురు ఒకరి నాభి నుండి ఒకరు ఎలా వెలువడుతారు, ఈ గుహ్యమైన రహస్యాన్ని పిల్లలైన మీరే అర్థం చేసుకుంటారు. ఇది అన్ని వేద శాస్త్రాల సారము.

గీతము:- నయనహీనులకు మార్గం చూపండి ప్రభు... (నయన్ హీన్ కో రాహ్ దిఖావో ప్రభూ...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన, అతి ప్రియమైన, చాలా కాలం దూరమై తర్వాత కలిసిన పిల్లలు అర్థాన్ని అయితే అర్థం చేసుకున్నారు. వాస్తవానికైతే తండ్రికి మొత్తం సృష్టిలోని పిల్లలందరూ తప్పకుండా ప్రియమైనవారు. ఈ మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో, వారు పరమపిత పరమాత్మ యొక్క సంతానమని పిల్లలకు తెలుసు. ఇది ఈశ్వరీయ పరివారము. పరివారంలో అందరికన్నా ఎక్కువ ప్రేమ పిల్లలను రచించినటువంటి తండ్రి పట్ల ఉంటుంది. అనంతమైన తండ్రి అంటారు, ప్రియమైన, మధురాతి-మధురమైన, చాలా కాలం దూరమై తర్వాత కలిసిన పిల్లలూ, 5 వేల సంవత్సరాల తర్వాత మళ్ళీ వచ్చి కలిసారు. ఎప్పుడు కలిసారు? ఈ సంగమయుగంలో. ఇప్పుడు తండ్రి వచ్చి పిల్లలందరినీ అశాంతి నుండి శాంతిలోకి తీసుకువెళ్తారు. శాంతి కోసం ఎన్ని కాన్ఫరెన్సులు మొదలైనవి చేస్తారు. సృష్టిలో కొట్లాటలు సమాప్తం అవ్వాలని మరియు పరస్పరంలో శాంతి ఎలా ఏర్పడుతుందని చర్చించుకోవడానికి పరస్పరంలో కలుసుకుంటారు. లేదంటే పరస్పరంలో కొట్లాడుకొని వినాశనం చేసేస్తారని అనుకుంటారు. వినాశనానికి భయపడతారు. తండ్రియే వచ్చి సుఖధామాన్ని అనగా ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని మళ్ళీ స్థాపన చేస్తారు అని, అది ఇప్పుడు జరుగుతూ ఉన్నదని మర్చిపోయారు. అనంతమైన తండ్రి నుండి అనంతమైన సుఖం యొక్క వారసత్వాన్ని తీసుకోవడానికి మీరందరూ కూర్చున్నారు. తప్పకుండా పరమపిత పరమాత్మ వచ్చి, మళ్ళీ ఆసురీ ప్రపంచాన్ని వినాశనం చేయిస్తారని మీకు తెలుసు. వినాశనమైతే తప్పకుండా అవ్వాలి కదా ఎందుకంటే ఈ సమయంలో అందరూ దుఃఖితులుగా ఉన్నారు. దుఃఖితులు ఎవరైతే ఉన్నారో, వారందరినీ సుఖమయంగా చేయడము - ఇది కల్ప-కల్పము తండ్రి కర్తవ్యమే. ఇకపోతే, ఎవరైతే స్వయమే దుఃఖితులుగా, పతితులుగా ఉన్నారో, వారు మళ్ళీ ఇతరులను పావనంగా, సుఖమయంగా ఎలా చేస్తారు, ఇది కూడా మొత్తం ప్రపంచం యొక్క విషయం. సర్వుల సద్గతిదాత ఒక్కరే - అని పాడుతారు కూడా. ఓ పరమపిత పరమాత్మా, వచ్చి పతితులైన మమ్మల్ని పావనంగా చేయండి. భారత్ లో గాడ్-గాడెస్ (భగవాన్-భగవతి) యొక్క రాజ్యం ఉండేదని, ఆ సమయంలో మేము లేమని అన్ని ధర్మాల వారికి తెలుసు. ప్రాచీన భారత్ కు చాలా మహిమ ఉంది. భగవంతుడు మొట్టమొదట స్వర్గాన్ని రచించారు, దానికి యజమానిగా ఎవరు ఉండేవారు? భారత్. స్వర్గంలో బంగారం, వజ్రాల మహళ్ళు ఉండేవి. భారత్ చాలా షావుకారుగా ఉండేది. ఇప్పుడు కలియుగ అంతిమంలో అనేకానేక ధర్మాలు ఉన్నాయి. ఇకపోతే, ఒక్క దేవతా ధర్మము ప్రాయః లోపమైంది. పేదదిగా, మహా దుఃఖమయంగా అయిపోయింది. ఇప్పుడు తండ్రి అంటారు, ఈ బ్రహ్మ దాదా అయితే వజ్రాల వ్యాపారిగా ఉండేవారు. చెప్పేది వీరు కాదు. ఈ బ్రహ్మకు కూడా తమ జన్మల గురించి తెలియదని నిరాకార తండ్రి ఈ శరీరం ద్వారా చెప్తారు. బ్రహ్మకుమార-కుమారీలైన మీకు కూడా మీ జన్మల గురించి తెలిసేది కాదు. నేను వీరిలో ప్రవేశిస్తాను, ఇది కూడా డ్రామాలో ఉంది. ఎలా ప్రవేశిస్తారు, ఈ ప్రశ్నే లేదు. తండ్రి అంటారు, నాకు నాదంటూ శరీరం లేదు. నేను సాధారణ వృద్ధ తనువులోకి వచ్చి ప్రవేశిస్తాను. రావడం కూడా భారత్ లో వస్తాను. వీరికి తమ జన్మల గురించి తెలియదు, నేను వచ్చి వీరికి అర్థం చేయిస్తాను. ఇదంతా తయారై-తయారుచేయబడిన అనంతమైన పెద్ద డ్రామా. ఏ క్షణమైతే గడుస్తుందో, అది మళ్ళీ రిపీట్ అవుతుంది. ఈ అనంతమైన డ్రామా రహస్యాన్ని తండ్రి మాత్రమే అర్థం చేయిస్తారు.

తండ్రి అంటారు, పిల్లలూ, మీరు ఏవైతే దాన-పుణ్యాలు మొదలైనవి చేస్తూ వచ్చారో, అదంతా భక్తి మార్గము. వీటి వలన ఎటువంటి ప్రాప్తి కలగదు ఎందుకంటే భక్తిలో ఇప్పుడు ఎటువంటి సారము కూడా లేదు. ఇన్ని చిత్రాలు మొదలైనవి ఏవైతే తయారుచేసారో, వీటిని బొమ్మల పూజ అని అంటారు. చిత్రాలు తయారుచేసారు, తినిపించారు, తాగించారు, ముంచేసారు. ఇదంతా తెలివితక్కువతనం కదా. యజ్ఞాలను రచించినప్పుడు ఒక పెద్ద శివలింగాన్ని మరియు చిన్న-చిన్న సాలిగ్రామాలను మట్టితో తయారుచేస్తారు. ఇలా ఎవరికి పూజ చేస్తున్నారు, ఇది కూడా అర్థం చేసుకోరు. తండ్రి మరియు పిల్లలు సేవ చేసారు అందుకే వారికి పూజ జరుగుతుంది. శివుని యొక్క లింగాన్ని తయారుచేస్తారు. పిల్లలైన మీ యొక్క సాలిగ్రామాలను కూడా తయారుచేస్తారు. పిల్లలైన మీరిప్పుడు తప్పకుండా భారత్ ను పవిత్రంగా తయారుచేసే సేవ చేస్తున్నారు. మీరు ఈశ్వరీయ సేవాధారులు. మీకు తండ్రి పట్ల ప్రీతి ఉంది. తండ్రి శ్రీమతంపై నడుచుకుంటారు, అందుకే శ్రీమత్ భగవద్గీత అని అంటూ ఉంటారు. భగవంతుడేమీ శాస్త్రాన్ని చదవరు. ఏ ధర్మ స్థాపకుడు ఎప్పుడూ తమ శాస్త్రాన్ని తీసుకోరు. వారు ధర్మ స్థాపన చేయడానికి వస్తారు. వారి వద్ద ఏ జ్ఞానం ఉందో, అదే వినిపిస్తారు. క్రైస్టు వచ్చి బైబిల్ చదివారని కాదు. అలా కాదు, వారు ధర్మ స్థాపన చేయడానికి వచ్చారు. తండ్రి వచ్చి శ్రీమతాన్ని ఇస్తారు. శ్రీ అనగా శ్రేష్ఠ మతము. ఉన్నతోన్నతమైన మతము భగవంతునిదే. పిల్లలైన మీరిప్పుడు శ్రీమతంపై నడుచుకుంటారు. తండ్రి అంటారు, పిల్లలూ, నన్ను స్మృతి చేయండి. కేవలం రెండే పదాలు ఉన్నాయి. చాలా ప్రేమతో పిల్లలూ, అని అంటారు. కావున వారు తండ్రి, మనమందరము ఈశ్వరీయ పరివారం యొక్క సభ్యులము. ఈ విషయం ఎవరి బుద్ధిలోనూ ఉండదు. వీరి బుద్ధిలో కూడా ఉండేది కాదు. ఇప్పుడు తండ్రి కూర్చుని వీరి ద్వారా అర్థం చేయిస్తారు, ఈ మనుష్యాత్మలు అందరూ ఎవరైతే ఉన్నారో, ఈ ఆత్మలందరినీ నేను పావనంగా తయారుచేసి తిరిగి తీసుకువెళ్ళాలి. మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళడానికి నేను డ్రామానుసారంగా మళ్ళీ వచ్చాను. ఈ బాబా ఆత్మలతో మాట్లాడుతారు. వీరి ఆత్మ కూడా వింటుంది. తప్పకుండా బాబా మనకు జ్ఞానాన్ని ఇస్తున్నారు. వీరికి తమకంటూ శరీరమైతే లేదు. శ్రీ కృష్ణునిది సాధారణ రూపము అని అనరు. వారు స్వర్గానికి మొదటి రాకుమారునిగా ఉండేవారు. కానీ వీరంతా శ్రీకృష్ణ భగవానువాచ అని అంటారు. ఇదైతే సంభవం కూడా కాదు. ఎంత తేడా ఉంది. సంగమంలో శ్రీకృష్ణుడు ఉండజాలరు. ఆర్టిఫిషియల్ కృష్ణులైతే చాలా మంది తయారవుతారు. ఇకపోతే, ప్రాక్టికల్ గా సత్యయుగంలో ఉంటారు. కృష్ణుని పేరుతో మరొకరు ఎవరైనా ఉండగలరా. ఈ పేరు అయితే స్వయానికి చాలా మంది పెట్టుకుంటారు. తండ్రి అంటారు, పిల్లలూ, ఈ అంతిమ జన్మలో పవిత్రంగా అవ్వండి, అప్పుడు పవిత్ర ప్రపంచ స్థాపనలో సహాయం అందుతుంది. పవిత్రత అయితే మంచిదే. చాలా మంది కుమార్తెలు దెబ్బలు తింటారు. అబలలపై అత్యాచారాలు జరుగుతాయి. బాబా, ఏం చేయాలి, మమ్మల్ని ఈ బంధనం నుండి విడిపించండి అని రాస్తారు. ద్రౌపదికి చీరలు ఇచ్చారు అన్నట్లు నాటకంలో చూపిస్తారు. ఇలా ఒక కథను తయారుచేసారు. బాబా అంటారు, ఇప్పుడు పవిత్రంగా అయినట్లయితే, 21 జన్మలు మీరు ఎప్పుడూ వివస్త్రగా అవ్వరు. అక్కడ ఉన్నదే రామరాజ్యము. ముఖ్యమైన వికారము, అశుద్ధ అహంకారము, దేహాభిమానము. దేహం పట్ల మోహం ఉంటుంది. అక్కడ ఆత్మాభిమానులుగా ఉంటారు. పాత శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుంటామని భావిస్తారు, దానిని ఆత్మాభిమాని అని అనడం జరుగుతుంది. తండ్రి అంటారు - మీరందరూ ఆత్మలు, శివబాబాను స్మృతి చేస్తారు ఎందుకంటే ఇప్పుడు తిరిగి వెళ్ళాలి. ఇది ఆత్మల యొక్క సత్యాతి-సత్యమైన ఆత్మిక యాత్ర. అందరూ సుప్రీమ్ తండ్రి వద్దకు వెళ్ళాలి. తీర్థ యాత్రలకు వెళ్ళినప్పుడు, దారిలో రామ-రామ అంటూ వెళ్తారు. తండ్రి అంటారు, మీరు తండ్రిని స్మృతి చేస్తూ వెళ్ళండి. ఇప్పుడు మొత్తం ప్రపంచమైతే రాజయోగాన్ని నేర్చుకోదు. కల్పక్రితం వారే ఇక్కడకు వస్తారు. ఇప్పుడు అంటు కట్టబడనున్నది. దేవీ-దేవతా ధర్మం యొక్క మధురమైన వృక్షం ఏదైతే ఉండేదో, అది ప్రాయఃలోపమైపోయింది. ఇకపోతే, కొమ్మలు, రెమ్మలు నిలిచి ఉన్నాయి (మర్రి వృక్షం యొక్క ఉదాహరణ). అలానే, ఈ దేవీ-దేవతా ధర్మం యొక్క పునాది ఏదైతే ఉందో, అది పాడైపోయింది. ఇకపోతే, గుర్తులు (చిత్రాలు) మిగిలి ఉన్నాయి. కానీ వారు ఎవరు, ఇది ఎవరికీ తెలియదు. అలాగే తమ ధర్మం గురించీ తెలియదు. అందుకే, హిందూ ధర్మము అని అనేస్తారు.

తండ్రి అంటారు, మీ భారత్ ఎంత సర్వ శ్రేష్ఠంగా ఉండేది. ధర్మం అనేది శక్తి అని ధర్మం కోసమే అనడం జరుగుతుంది. ఇప్పుడైతే దేవతా ధర్మం లేదు. మళ్ళీ ఆ ధర్మం ఎలా స్థాపన అవుతుంది. తండ్రి సర్వశక్తివంతుడు, వారసత్వం వారి నుండి లభిస్తుంది. శక్తి కూడా వారి నుండి లభిస్తుంది. తండ్రి సృష్టి యొక్క బీజరూపుడు. మనం వారి పరివారం అయ్యాము. తండ్రి సత్యమైనవారు, చైతన్యమైనవారు, జ్ఞానసాగరుడు. అన్నీ ఆత్మలో ఉన్నాయి. ఆత్మనే వింటుంది, చదువుతుంది, ఆత్మలోనే మంచి-చెడు సంస్కారాలు ఉంటాయి. ఇప్పుడు అందరి ఆత్మ తమోప్రధానంగా అయిపోయింది. అందరికన్నా ఎక్కువ తమోప్రధాన బుద్ధి కలవారిగా భారతవాసులే అయ్యారు. శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైన ఆత్మలు కూడా భారత్ కు చెందినవారే. వారే స్వర్గానికి యజమానులుగా ఉండేవారు. ఈ నాటకము తయారై ఉంది.

అందరికీ తమ-తమ పాత్ర లభించి ఉంది. ఆత్మలన్నీ ఒకేలా ఉంటాయి, వాటిలో ఏ వ్యత్యాసం ఉండదు. మా ఆత్మ చిన్నగా ఉంది, బాబా పెద్దగా ఉన్నారు అని కాదు. అలా కాదు, ఆత్మ చిన్నగా, పెద్దగా ఉండదు. ఆత్మ 84 జన్మల పాత్రను మళ్ళీ రిపీట్ చేస్తుంది. దానికి ఎప్పుడూ అంతం ఉండదు. ఒక్క ఆత్మ ఎంత సేవ చేస్తూ ఉండవచ్చు. ఆ అవినాశీ పాత్ర ఎప్పుడూ చెరిగిపోయేది కాదు. ఈ విషయాల గురించి విద్వాంసులకు, పండితులకు, శాస్త్రాల యొక్క అథారిటీ అయిన వారికి తెలుసా? ఇంత చిన్న ఆత్మలో ఎంత పెద్ద భారీ పాత్ర ఉంది. పరమపిత పరమాత్మ కూడా డ్రామా వశంలో ఉన్నారు. పాత్రను అభినయించడానికి బంధించబడి ఉన్నారు. ఏక్యురేట్ (ఖచ్చితమైన) సమయానికే వస్తారు. వారు కూడా తమ పాత్రను సమయానికి అభినయించాలి, అందరినీ సుఖమయంగా చేయాలి. ఆత్మ అంటే ఏమిటి, ఆలోచించండి. బాబా ఆత్మ కూడా ఇంత చిన్న బిందువులా ఉంది. ఇంత చిన్న వస్తువు యొక్క పూజనైతే ఎవరూ చేయలేరు. భక్తి కోసం మళ్ళీ, పూజ చేసేందుకు వీలుగా పెద్దగా తయారుచేస్తారు. వారిని శివ్ లేక రుద్రుడు అని కూడా అంటారు. బిందువులా ఉంటారు. తిలకం పెడతారు కదా. ఇక్కడ ఇవి చాలా అర్థం చేసుకోవాల్సిన విషయాలు మరియు ఇంకెవ్వరూ ఇవి అర్థం చేయించలేరు. ఇవి తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఇవి చాలా సూక్ష్మమైన విషయాలు. తండ్రి అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఆత్మ ఎంత చిన్నదో చూడండి. ఆత్మ యొక్క ఇంద్రియాలను చూడండి, ఎంత పెద్దగా ఉన్నాయి. ఈ సమయంలో అందరి ఆత్మలు మరియు శరీరాలు, రెండూ పతితంగా ఉన్నాయి. ఇప్పుడు మళ్ళీ పావనంగా అవ్వాలి. మీరు అవ్యభిచారులుగా అవ్వండి, ఒక్కరి నుండే వినండి. ఒక్కరినే గుర్తు చేయండి. ఓహో! బాబా, మీరైతే చాలా అద్భుతం చేస్తారు. ఎలాంటి జ్ఞానాన్ని వినిపిస్తారు. ఈ జ్ఞానాన్ని ఇవ్వగలిగే శక్తి ఇంకెవ్వరికీ లేదు. ఎప్పుడైతే తండ్రి వచ్చి చదివిస్తారో, అప్పుడే మీ ఎక్కే కళ జరుగుతుంది. ఈ సమయంలో మనుష్యమాత్రులందరూ పతితంగా ఉన్నారు, అందుకే తండ్రి అంటారు - నేను అందరినీ ఉద్ధరించేందుకు వస్తాను. రాత్రి నుండి పగలులోకి వెళ్ళే మార్గాన్ని తెలియజేస్తాను. నయనహీనులకు దారి చూపించండి ప్రభూ... అని పాడుతారు కూడా అనగా మేము నయనహీనులము, మాకు దారి తెలియజేయండి అని అందరూ అంటారు. ఎక్కడకి దారి? తమ ఇంటికి. ఇక్కడైతే చాలా దుఃఖం ఉంది. బాబా, అంధులమైన మాకు చేతికర్ర మీరే. బాబా అనే పదముతో వారసత్వం గుర్తుకొస్తుంది. ప్రభు లేక ఈశ్వరా అని అనడంతో వారసత్వం యొక్క నషా కలగదు. ఎందుకంటే త్వమేవ మాతాశ్చ పితా... అని అంటారు, ఇది వారి మహిమ. ఈ వేదాలైతే అనాది అని మనుష్యులు అంటారు. కానీ ఎప్పటి నుండి చదువుతూ వచ్చారు అని అడగండి. సత్యయుగం నుండి మొదలుకొని? అక్కడ శాస్త్రాలైతే ఉండనే ఉండవు. ఇవి భక్తి మార్గానికి చెందినవి. ఏమీ తెలియదు. తండ్రి అంటారు, ఇప్పుడు నేను వచ్చి మీకు అన్నింటి సారాన్ని బ్రహ్మ ద్వారా అర్థం చేయిస్తాను. బ్రహ్మ బిడ్డ నా వారా లేక విష్ణు నాభి నుండి వెలువడ్డారా! బ్రహ్మ అయితే శివుని కుమారుడు అయినట్లు. విష్ణువు కుమారుడైతే కాదు. అవును, బ్రహ్మనే మళ్ళీ విష్ణువు అవుతారు. మళ్ళీ విష్ణువు 84 జన్మల తర్వాత బ్రహ్మ అవుతారు. ఇది చాలా గుహ్యమైన రహస్యము. ఇది పిల్లలైన మీరే అర్థం చేసుకుంటారు. ఇప్పుడు బ్రహ్మ ముఖం ద్వారా బ్రాహ్మణ పిల్లలైన మీ జన్మ జరిగింది కావున పిల్లలైన మీకు ఎంత నషా మరియు సంతోషం ఉండాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సంపూర్ణ పావనంగా అయ్యేందుకు అవ్యభిచారిగా అవ్వాలి. ఒక్క తండ్రి నుండే వినాలి, ఒక్కరినే స్మృతి చేయాలి.

2. ఈశ్వరీయ సేవాధారిగా అయి భారత్ ను పావనంగా తయారుచేసే సేవ చేయాలి. ఒక్క తండ్రి పట్ల ప్రీతి బుద్ధి కలిగి ఉండాలి.

వరదానము:- స్వస్థితి ద్వారా ప్రతి పరిస్థితిని దాటేటువంటి మాస్టర్ త్రికాలదర్శీ భవ

ఏ పిల్లలైతే త్రికాలదర్శీ స్థితిలో స్థితులై ఉంటారో, వారు తమ స్వస్థితి ద్వారా ప్రతి పరిస్థితిని అసలు ఏమీ లేనట్లుగా దాటేస్తారు. జ్ఞాన సంపన్నమైన త్రికాలదర్శీ ఆత్మలు సమయమనుసారంగా ప్రతి శక్తిని, ప్రతి పాయింటును, ప్రతి గుణాన్ని ఆజ్ఞానుసారంగా నడిపిస్తారు. సమయం వచ్చినప్పుడు సహన శక్తిని ఆజ్ఞాపిస్తే, కార్యం పూర్తయిన తర్వాత సహన శక్తి రావడం అన్నట్లు జరగకూడదు. ఏ సమయంలో, ఏ శక్తి, ఏ విధంగా కావాలో - ఆ సమయంలో తన కార్యం చేయాలి, అప్పుడు, ఖజానాలకు యజమాని, మాస్టర్ త్రికాలదర్శీ అని అంటారు.

స్లోగన్:- ఎవరైతే సదా సంతోషంగా ఉంటారో మరియు అందరికీ సంతోషాన్ని పంచుతారో, వారే సత్యమైన సేవాధారి.